క్లుప్తంగా

25 నుంచి గుండిపార్వతి అమ్మవారి తిరునాళ్ల



భట్టిప్రోలు: భట్టిప్రోలు హిందూ స్మశానవాటికలో కొలువైన గుండి పార్వతి అమ్మవారి తిరునాళ్ల ఈ నెల 25,26 తేదీలలో నిర్వహించనున్నట్లు కాపు సంఘం నాయకులు, నిర్వాహకులు బుధవారం తెలిపారు. 25వ తేదీన అమ్మవారిని గ్రామోత్సవం కావించనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టం 26న జరుగుతుందని తెలిపారు.

కార్మికుల క్లెయిమ్స్ వెంటనే పరిష్కరించాలి



బాపట్ల: భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్స్ వెంటనే పరిష్కారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌ను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ కోరారు. బాపట్లలోని జేసీ కార్యాలయంలో బుధవారం ఆయనను కలిసి మృతిచెందిన భవన నిర్మాణకార్మికుల క్లెయిమ్స్‌ను వెంటనే పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్స్ పెండింగ్‌లో ఉండటం వలన వారి కుటుంబీకులు ఇబ్బందులుపడుతున్నారని జేసీ దృష్టికి తీసుకొచ్చారు. జేసీని కలిసిన వారిలో నాయకులు జేబీ శ్రీధర్, మందాడి మాల్యాద్రి, మంచాల కృష్ణారెడ్డి, కూచిపూడి అబ్రహం తదితరులు ఉన్నారు.

రాజన్న, జగనన్నలు నేతన్నల బంధువులు

రేపల్లె చేనేత సహకార సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు నేతన్నలకు బంధువులనటంలో ఎటువంటి సందేహం లేదని బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ చేనేత విభాగం మాజీ అధ్యక్షుడు, రేపల్లె చేనేత సహకార సంఘం అధ్యక్షుడు పట్టెం శ్రీనివాసరావు అన్నారు. నేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మత్స్యకార భరోసా కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నేతన్న నేస్తంతో సంబంధం లేకుండా చేనేతలకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలన్నారు. చేనేతలకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ చట్టాలను అమలు చేయాలన్నారు. జీఎస్టీను తొలగించేలా కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలన్నారు. ఆప్కో సంస్థను బలోపేతం చేసి చేనేత కార్మికుల వద్దనున్న వస్త్రాలను కొనుగోలు చేయాలన్నారు. చేనేత కార్మికులందరికీ నేతన్న నేస్తం వర్తింపు చేయాలన్న తదితర సమస్యలను విన్నవించినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతన్నల సమస్యలు పరిష్కరించే దిశగా హామీనిచ్చారని పేర్కొన్నారు.

యువతి అదృశ్యం

తెనాలిరూరల్: యువతి అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన 22 ఏళ్ల యువతి డిగ్రీ పూర్తి చేసి ఇంటివద్ద ఉంటోంది. మంగళవారం ఇంటినుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు, గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు.

పరస్పర దాడి కేసులో నిందితులకు జరిమానా

తెనాలిరూరల్: పరస్పర దాడి కేసులో నిందితులకు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో 2017లో ఇరువర్గాలు ఓ స్థలం విషయమై ఘర్షణ పడి పరస్పర దాడికి పాల్పడ్డారు. చుండూరు పోలీసులు మొత్తం 11 మందిపై పరస్పర కేసులు నమోదు చేశారు. కేసులు బుధవారం విచారణకు రాగా సాక్షాధారాలను పరిశీలించిన రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత, నిందితులకు రూ. 300 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. రెండు కేసుల్లో తెనాలి సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్, రేపల్లె ఏపీపీ గాదె వెంకటేశ్వర్లు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

వన్‌టౌన్ పీఎస్ పరిశీలన



తెనాలిరూరల్: తెనాలి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ బి.జనార్ధనరావు బుధవారం పరిశీలించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. సచివాలయ మహిళా పోలీసులతో మాట్లాడి విధి నిర్వహణలో పాటించాల్సిన అంశాను వివరించారు. వన్‌టౌన్ సీఐ కె.చంద్రశేఖర్, ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

పేదల బతుకుల్లో వెలుగులు

- రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- చినపులివర్రులో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళకు కరపత్రం అందజేసి సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాల ఫలితంగా పేద వర్గాలకు చెందిన ప్రజల బతుకులు వెలుగులతో నిండాయని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. బుధవారం చినపులివర్రులోని ఎస్సీ, బీసీ ప్రాంతాలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం లబ్ధిదారులకు అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆయన ప్రతి గడపకూ వెళ్లి లబ్ధిదారులకు వివరించి వారికి పథకాలు అందినదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్ల కాలంలో ఒక్కో గృహంలోని లబ్ధిదారులకు ఏఏ పథకం ద్వారా ఎంత మొత్తంలో నగదు అందినదీ వారికి వివరించడంతోపాటు, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న రోజుల్లో వెన్నుదన్నుగా నిలిచి తిరిగి అధికారంలోకి తీసుకురావాలని లబ్ధిదారులను కోరారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవాలన్న కాంక్షతో సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే ప్రతిపక్ష టీడీపీ సంక్షేమ పథకాల పంపిణీ దండగ అంటూ వ్యాఖ్యానిస్తూ, ప్రజా సంక్షేమాన్ని అడ్డుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని ఆపార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు.

పేదల ఓట్లు అడగడానికి చంద్రబాబు అనర్హుడు...

పేద ప్రజలకు అమరావతిలో ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకునేందుకు కోర్టులను ఆశ్రయించిన చంద్రబాబునాయుడు అదే పేదల ఓట్లను ఏ మొహం పెట్టుకుని అడుగుతాడని మంత్రి మేరుగ నాగార్జున ప్రశ్నించారు. రాజధాని ప్రాంతంలో పేదలు నివాసం ఉంటే ఆర్థిక అసమానతలు ఏర్పడతాయన్న సాకుతో కోర్టులను ఆశ్రయించి పేదల పట్ల చిన్నచూపు ప్రదర్శించిన టీడీపీకి కోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదన్నారు. కోర్టు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వవచ్చునని తీర్పు ఇవ్వడం ముదవాహమన్నారు. ఓ పక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తూ, ప్రతి ఒక్కరికి మేలు చేకూర్చేందుకు ప్రయత్నిస్తుంటే పేద ప్రజలను అవమానించేలా వ్యవహరిస్తున్న చంద్రబాబునాయుడుకు రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెపుతారని వ్యాఖ్యానించారు. అధికారమే లక్ష్యంగా కాపు సామాజిక వర్గ వ్యతిరేకి అయిన చంద్రబాబు వారి ఓట్లు వేయించుకుని, వారిని రాజకీయంగా అణగదొక్కేందుకు కుటిల రాజకీయ యత్నాలు చేస్తున్నారని, టీడీపీ కుయుక్తులను కాపులు గమనిస్తున్నారన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చంద్రబాబుకు అధికారం కట్టబెట్టడమే పరమావధిగా పనిచేస్తున్నారని విమర్శించారు. కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, భట్టిప్రోలు ఎంపీపీ దావూరి లలితకుమారి, సర్పంచ్‌లు దార రవికిర్మణయ్, గుంటూరు నీలాబ్రం, లాం రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యులు అమిరిశెట్టి శ్రీధర్, ఇంటూరి ప్రవీణ్, పోలిమట్ల ఆనంద్‌కిశోర్, వేమూరు మార్కెట్‌యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, వైఎస్సార్ సీపీ నాయకులు చిలక ప్రకాశం, కూచిపూడి మోషే, మేకతోటి ఏలియా, తోడేటి రత్నాకర్, మాతంగి రత్నకుమార్, కనపర్తి మోహన్‌రావు, దున్న వెంకయ్య, బాణాల రవి, కసుకుర్తి ప్రసాద్, వెనిగళ్ల బాబురావు, తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు, పంచాయతీ కార్యదర్శి స్వరూపరాణి పాల్గొన్నారు.

‘ఉపాధి’లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

డ్వామా పీడీ శంకర్ నాయక్



మండల పరిషత్ కార్యాలయం వద్ద సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించిన అధికారులు

వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా డ్వామా ప్రాజెక్ట్ అధికారి శంకర్ నాయక్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16వ సామాజిక తనిఖీ ఈ నెల 5వ తేదీ నుంచి 15 వరకు మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ చేశారని ఆయన తెలిపారు. సామాజిక తనిఖీల్లో ఎక్కడ అవినీతికి పాల్పడ లేదన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ పంచాయతీల్లో పని అడిగిన ప్రతి కూలీకి ఉపాధి కల్పించాలని ఆయన ఆదేశించారు. గతేడాది కన్నా ఈ ఏడాది పనుల సంఖ్య పెంచాలని ఆయన చెప్పారు. కూలీలందరికీ 100 రోజు లు పనులు కల్పించాలని ఆయన సూచించారు. అవినీతి లేకుండా కూలీలకు డబ్బులు చెల్లించాలన్నారు. జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్ట్ అధికారి భవాని, స్టేట్ ఆడిట్ అధికారులు విజయ్ భాస్కర్, బి.రవికుమార్, బాబురావు, అధికారులు పాల్గొన్నారు.

‘ప్రైవేటు’ కన్నా ప్రభుత్వ కళాశాలలు మిన్న

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్



క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్

రేపల్లె: కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలకన్నా ప్రభుత్వ కళాశాలలు మిన్న అని, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ అన్నారు. ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ బుధవారం పట్టణంలో క్యాంపెయిన్ నిర్వహించి మాట్లాడారు. 2022-23 విద్యాసంవత్సరంలో తమ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. అంతర్జాతీయ ప్రతిష్ట కలిగిన అమరావతి వీఐటీలో తమ కళాశాల విద్యార్థి ఉచితంగా స్థానం సాధించాడన్నారు. నిష్ణాతులైన అధ్యాపక బృందంచే తమ కళాశాలలో విద్యాబోధన జరుగుతుందని, ఉచితంగా విద్యార్థులకు బోధన చేస్తామని, తల్లిదండ్రులు తమ చిన్నారులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



స్వామివారి పూజల్లో పాల్గొన్న భక్తులు

బాపట్ల అర్బన్: సువర్చలా సమేత ప్రపత్త్యాంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో 74వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామివారికి మన్యుసూక్త సహిత హనుమన్మహా మంత్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అన్నకూట మహోత్సవం, కుంభహారతి సామూహిక అన్న సంతర్పణ జరిగింది. సుమారు 5 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు, కొరత్రూటి ప్రసాద్, చాపల సుబ్రహ్మణ్యం, కోటబ్రహ్మయ్య, పట్టెం చెంచుపున్నయ్య అన్న సంతర్పణ ప్రారంభించారు. కార్యక్రమంలో అలయ అర్చకులు శ్రీనివాసుల విఖనస మూర్తి, శ్రీనివాసుల కృష్ణమాచార్యులు, మేడూరి వెంకట అప్పలాచార్యులు, రొంపిచర్ల కేశవాచార్యులు, రొంపిచర్ల గోపాలచార్యులు, మారుతి రామబాల భక్త సమాజం అధ్యక్షుడు నెమలికంటి హనుమంతరావు, దేశిరాజు రమణబాబు పాల్గొన్నారు.

పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఏపీ రైతు, కౌలు రైతుల సంఘాల నాయకులు

భట్టిప్రోలు: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా రంగు మారిన పసుపును మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా గుంటూరు, బాపట్ల జిల్లాలలోని మంగళగిరి, తాడేపల్లి, కొల్లిపర, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఏపీ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, జవ్వాది సాంబశివరావు, గొట్టుముక్కల బాలాజీ, బండారు శ్రీనివాసరావు, కొనరాజు సతీష్‌బాబు, వెంకటేశ్వరరావు, వేములపల్లి రత్న గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి

కర్లపాలెం: చదువులతో పాటు ఆటల్లోనూ రాణించాలని కర్లపాలెం శాఖా గ్రంథాలయాధికారి టీవీ రమణమ్మ తెలిపారు. కర్లపాలెం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు నీతి కథలు, తెలుగు పద్యాలు చెప్పటంతో పాటు చిన్నారులకు ఖోఖో ఆడటంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఒకేచోట కూడి తమకు ఇష్టమైన పుస్తకాలు చదువుకునేందుకు వేసవి శిక్షణ శిబిరం దోహదపడుతుందని చెప్పారు.

21న బండ్లమ్మ దేవాలయంలో అన్నసంతర్పణ

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ఈనెల 21వ తేదీన అన్న సంతర్పణ జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఘంటసాల నరసింహమూర్తి తెలిపారు. ఈనెల 3వ తేదీనుంచి 7వ తేదీ వరకు బండ్లమ్మ వారి వార్షిక తిరునాళ్ళ కార్యక్రమంలో భాగంగా 21న అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి భక్తులు, దాతల సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు. అదేవిధంగా ఈనెల 19వ తేదీన అమావాస్య సందర్భంగా దేవాలయం ప్రాంగణంలో అమావాస్య హోమం జరుగుతుందని తెలిపారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం



తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని శాఖాగ్రంథాలయంలో నడుస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రేడ్-1 గ్రంథాలయాధికారి కె.రమాదేవి కోరారు. ప్రస్తుతం గ్రంథాలయంలో 6-10 తరగతుల విద్యార్థులకు నీతికథలు, నీతిపద్యాలు, ప్రముఖల జీవితచరిత్రలు బోధించటంతో పాటు డ్రాయింగ్, ఇండోర్ గేమ్స్ నేర్పిస్తున్నట్టు తెలిపారు. ప్రతివిద్యార్థి పుస్తక పఠనం అలవరచుకోవాలన్నారు. స్థానిక పాఠశాలకు చెందిన హుస్సేన్ మాస్టారు బుధవారం నీతిపద్యాలు, భావాలు నేర్పించారు. పలు ఇండోర్ గేమ్స్ నేర్పించారు. విద్యార్థులకు కథలు చెప్పి, మళ్లీ తిరిగి వారిచేత చెప్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి విజ్ఞాన శిబిరంలో చేర్పించాలని కోరారు.

పెసర్లంకలో ఇంటింట ధర్మ ప్రచారం

పెసర్లంక(భట్టిప్రోలు): సమరసత సేవా ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటింటి ధర్మ ప్రచార కార్యక్రమం బుధవారం భట్టిప్రోలు మండలం పెసర్లంకలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎఫ్ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి తలుపులకు స్టిక్కర్లు అంటించారు. గ్రామ కన్వీనర్ నిడుమోలు బసవయ్య మాట్లాడుతూ ఎస్ఎస్ఎఫ్ నిర్వహిస్తున్న కార్యక్రమాల వల్ల హిందూ ధర్మ నిలబడుతుందని అన్నారు. 5 వేల సంవత్సరాల క్రితమే అద్భుతమైన భగవద్గీత వాక్యాలు ఉన్న స్టిక్కర్లను అంటించి కరపత్రాలను పంచి ధర్మ ప్రచారం చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, ఎస్ఎస్ఎఫ్ కార్యకర్తలు తిరుపతమ్మ, పులివర్తి శివకుమారి, నర్రా పద్మ, పెదపూడి కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కర్లపాలెం: ట్రక్ ఆటో ఢీకొని తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న ఓ మహిళ మృతిచెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య తెలిపిన వివరాల మేరకు బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం గోకరాజు నల్లిబోయినవారిపాలెంకు చెందిన ఆసోది శ్రీనివాసరెడ్డి అతని భార్య సుబ్బరావమ్మ(20) ఇరువురు కలసి ఈ నెల14వ తేదీన ఎంపీ రాజుపాలెంలో జరిగిన శుభకార్యానికి వచ్చారు. అనంతరం ఇరువురు కలసి దాస్‌నగర్ సమీపంలోని 216 జాతీయ రహదారి దాటుతుండగా బాపట్ల నుంచి కర్లపాలెం వైపు వస్తున్న ట్రక్ ఆటో ఇరువురిని ఢీకొనటంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురిని బంధువులు గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించగా చికిత్స పొందుతూ సుబ్బరావమ్మ బుధవారం మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.శివయ్య చెప్పారు.

ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం

- తగిన రుసుముతో డి-పట్టా మంజూరు
- తహసీల్దార్ కె.రవిబాబు



తెనాలి: ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు తెనాలి మండల తహసీల్దార్ కె.రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 2019 అక్టోబరు 15 లేదా అంతకు పూర్వం అభ్యంతరం లేని, అనధికారంగా ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని జీవిస్తున్న వ్యక్తులకు భూమిని కేటాయించే పథకాన్ని ప్రవేశపెడుతూ ప్రభుత్వం 2021లో జీఓ జారీచేసినట్టు గుర్తుచేశారు. ప్రస్తుతం ఆ ఉత్తర్వులకు కొన్ని సవరణలు చేస్తూ గత ఫిబ్రవరి 16న ప్రభుత్వం జీఓ నెం.60 విడుదల చేసిందని తెలిపారు. ఆ ప్రకారం అభ్యంతరం లేని, అనధికారికంగా ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించుకోవచ్చని తెలిపారు. తమ ఆధీనంలో ఉన్న భూములకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుమును చెల్లించాలని తెలిపారు. అన్ని అర్హతలు గల దారిద్ర్యరేఖకు దిగువన, ఎగువన ఉన్న అందరికీ వంద గజాల వరకు ఉచితంగా డి-పట్టా మంజూరు చేస్తామన్నారు. పదేళ్లలోపు భూ బదలాయింపు హక్కులు లేకుండా, పదేళ్ల తర్వాత అందుకు అవకాశం కల్పిస్తామని వివరించారు. 101 గజాల్నుంచి 200 గజాల వరకు బేసిక్ విలువలో 50 శాతం, 201 నుంచి 300 గజాల వరకు 100 శాతం, 301 నుండి 500 గజాల వరకు 150 శాతం ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. 500 గజాలకు మించిన ఆక్రమణలను తొలగిస్తామని స్పష్టంచేశారు. క్రమబద్ధీకరణ కోసం డిసెంబరు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సదరు ఇంటికి సంబంధించిన విద్యుత్ కనెక్షను, ఇంటి నిర్మాణ అనుమతి పత్రం, కుళాయి పన్ను రశీదు, ఇతర ఆధారాలతో గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ రవిబాబు వివరించారు.

కళాకారుడు బాబురావుకు సన్మానం



తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం దేవుడు చేసిన మనుషులు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం శ్రీకృష్ణతులాభారము చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కళాకారుడు, డోలక్, తబల విద్వాంసులు కోడూరు బాబురావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, పినపాటి రవీంద్ర, వేములమడ వెంకటేశ్వరరావు, తాడిబోయిన సురేష్, ఫణిదపు దుర్గా, కోడూరు సత్యనారాయణ, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఏసీలకు పెరిగిన గిరాకీ

- వడగాడ్పులతో జనం బెంబేలు
- ఏసీల కోసం ఎలక్ట్రానిక్ పరికరాల దుకాణాలకు క్యూ కడుతున్న వైనం



ఒక ఎలక్ట్రానిక్ పరికరాల దుకాణంలో కొనుగోలుదారుల సందడి

బాపట్ల అర్బన్: భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ప్రజలు వేడి తాపానికి తట్టుకోలేకపోతున్నారు. ఉదయం 9 గంటల నుంచి వేడిగాలులు మొదలవుతున్నాయి. ఇంట్లో ఫ్యాన్లు, కూలర్లు వేసుకున్నా వేడిగాలి తప్పడం లేదు. దీంతో ఏసీ (ఎయిర్ కండిషన్)ల కోసం ప్రజలు షోరూమ్‌లకు క్యూ కడుతున్నారు. బాపట్లలో గత కొన్నివారం రోజులుగా 42-45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. ఒక్కసారిగా ప్రజలు ఏసీలు కొనుగోలు చేసేందుకు రావడంతో షాపులు యజమానులు ఇదే అదునుగా ధరలు పెంచుతున్నారు. అధిక ధరలకు విక్రయించేందుకు స్టాక్ లేదని కొందరు వ్యాపారులు ఇదే అదునుగా ప్రజలను దోచుకుంటున్నారు. పట్టణంలో పెద్ద షోరూములు, చిన్న షోరూములు కలిపి మొత్తం 20 ఉన్నాయి. ప్రతిరోజు సుమారుగా 30 నుంచి 50 వరకు ఏసీలు అమ్ముడు పోతున్నాయంటే, ప్రస్తుతం ఎండ వేడి ఎలా ఉందో వేరే చెప్పనవసరం లేదు. ఈనెల మొదటివారంలో పట్టణంలో అన్ని షోరూమ్‌లు కలిపి 100 నుంచి 120 ఏసీలు మాత్రమే విక్రయించేవారు. ప్రస్తుతం 400 నుంచి 500 ఏసీలు విక్రయిస్తున్నారు.

సాధారణ మధ్యతరగతి ప్రజలు సైతం...

ఒకప్పుడు ధనవంతులు మాత్రమే ఏసీలు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం సులభ వాయిదాల పద్ధతులను దుకాణదారులు ఇస్తుండడంతో సాధారణ, మధ్యతరగతి ప్రజలు సైతం ఏసీలు కొనుగోలు చేస్తున్నారు.

టెక్నీషియన్లకు పెరిగిన డిమాండ్..

వేల రూపాయలు పెట్టి ఏసీ కొనుగోలు చేసినా.. వాటిని టెక్నీషియన్ వచ్చి ఇంటి వద్ద బిగించాలి. రోజుకి వందల కొద్ది ఏసీలు విక్రయిస్తున్నా వాటిని బిగించేందుకు టెక్నీషియన్ దొరకపోవడంతో దుకాణ యజమానులు అసౌకర్యానికి గురవుతున్నారు. టెక్నీషియన్లకు గిరాకీ పెరిగింది. టెక్నీషియన్ ప్రస్తుతం రూ.వెయ్యి డిమాండ్ చేస్తున్నారు.

వేడి తట్టుకోలేకపోతున్నాం..



నేను ప్రైవేటు జాబ్ చేస్తున్నాను. ఈ ఏడాది ఏసీ కొనుగోలు చేద్దామనుకున్నాను కానీ డబ్బులు లేకపోవడంతో వచ్చే ఏడాది కొందాములే అనుకున్నాను. ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో ఇబ్బందికరంగా మారింది. రాత్రి ఇంటికి వచ్చి పడుకున్న ఫ్యాన్ గాలి కూడా వేడిగా వస్తుండడంతో నిద్ర పట్టడం లేదు. తప్పని పరిస్థితుల్లో ఫైనాన్స్ మీద ఏసీ కొనుగోలు చేశాను.

– నల్లబంటి సాయి, ఏసీ వినియోగదారుడు